క్లుప్తంగా

నేటి నుంచి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులోని నంబాయ్యగుట్టపై కొలువైన శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్టు బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 24న బ్రహ్మోత్సవాల అంకురార్పణ, 25న స్వామి వారి కల్యాణం, 26న రథోత్సవం, 27న ప్రభలు, బండ్లు తిరుగుట, 28న స్వామి వారికి చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. బ్రహ్మోత్సవాలకు మండల పరిధితో పాటు సమీప గ్రామాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజావాణిలో 23 ఫిర్యాదులు



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఆర్డీఓ చంద్రకళ

చేవెళ్ల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం డివిజన్ స్థాయిలోనే ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ అన్నారు. కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో 23 ఫిర్యాదులు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇందులో 15 ధరణి సమస్యలకు సంబంధించినవి, మిగతావి ఇతర సమస్యలకు సంబంధించినవి చెప్పారు. ఫిర్యాదులను ఆయా శాఖలకు చెందిన అధికారులకు పంపించి పరిష్కరించాలే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సోమవారం డివిజన్ స్థాయిలో ఆర్డీఓ కార్యాలయంలోనే ప్రజావాణి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయం ఇన్‌చార్జి ఏఓ రాజశేఖర్ ఉన్నారు.

కొనసాగుతున్న ఇళ్ల సర్వే

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుంది. కొందుర్గులో 2,828 ఇళ్ల పూర్తయినట్లు ఎంపీడీఓ లక్ష్మి అనురాధ తెలిపారు. సోమవారం కొందుర్గు, చెక్కలోని, వెంకిర్యాల గ్రామాల్లో ఎంపీడీఓతోపాటు ఎంపీఓ లాలయ్య పర్యవేక్షించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని కాస్లాబాద్, పీర్జాపూర్, గుంజల్‌పహాడ్, జాకారం తదితర గ్రామాల్లో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పర్యవేక్షించారు.

హిమాయత్‌నగర్‌లో..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే మమ్మరంగా సాగుతోంది. సర్వే తీరును గ్రామ ప్రత్యేక అధికారి అనురాధారెడ్డి పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె సూచించారు.

క్రషర్‌పై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఇప్పలపల్లి గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని ఇప్పలపల్లి, దత్తాయపల్లి, వేములనర్వ గ్రామాల శివారులో ఉన్న క్రషర్ పైన చర్యలు తీసుకోవాలని ఇప్పలపల్లి గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ అజాంఅలీ, సీఐ నరహరికి వినతిపత్రాలను అందించారు. క్రషర్‌లో పేల్చే బ్లాస్టింగ్‌తో పెద్ద పెద్ద శబ్దాలు వస్తున్నాయని వారు ఆరోపించారు. వాటితో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిప్పళ్ల శ్రీనాథ్, నాయకులు రాజేష్, ప్రవీణ్, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి

నందిగామ: విద్యుత్ సమస్యను పరిష్కరించాలని మండలంలోని బుగ్గోనిగూడ గ్రామానికి చెందిన బుగ్గశ్రావణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విద్యుత్ ఏడీ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో లో ఓల్టేజీ సమస్య ఉందని, 24 గంటల విద్యుత్ అందడం లేదని, వ్యవసాయ పంట పొలాల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలతో ఇబ్బందులు పడుతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. వాటిని పరిష్కరించాలని కోరారు.

ప్రజావాణిని సద్వినియోగించుకోండి

కందుకూరు: కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ పరిధిలోని మండలాలకు చెందిన పలువురు తమ సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు అందించారు. కాగా మొత్తం ప్రజావాణిలో 13 అర్జీలు వచ్చాయి. అందులో ఆమన్‌గల్లు నుంచి రెండు, మిగతా మండలాల నుంచి ఒక్కొక్కటి, కందుకూరు నుంచి 5 అర్జీలు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.

పని బారెడు.. వేతనం మూరెడు

కనీస జీతాలకు నోచుకోని పంచాయతీ కార్మికులు

- అవస్థలు పడుతున్న శ్రమజీవులు
- పట్టించుకోని అధికారులు



రోడ్డును శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)

కొత్తూరు: గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్మికుల జీవితాలు అగమ్యగోచరంగా తయారయ్యాయి. చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. దానికి తోడు ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ జీఓ మేరకు 500 జనాభాకు ఒకరు చొప్పున సిబ్బందిని నియమించుకోవాలని చెప్పడంతో కార్మికులపై అదనపు భారం పడుతుంది. ఎప్పటికైనా తమ శ్రమను గుర్తించి వేతనాలు పెంచుతారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

భారంగా కుటుంబ పోషణ

కొత్తూరు మండలంలో 12 గ్రామ పంచాయతీలున్నాయి. అన్ని పంచాయతీల్లో సుమారు వందకు పైగా పారిశుద్ధ్య, వాటర్‌మెన్, ఇతర కార్మికులు పని చేస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో 10 మొదలుకొని 20 ఏళ్ల నుంచి పనులు చేస్తున్న వారున్నారు. కాగా వారికి నెలకు రూ.8,000 నుంచి రూ.9,500 వేతనాలు కూడా రావడం లేదు. ఇచ్చే జీతాలు సైతం ఒక్కో నెలలో ఆలస్యం జరుగుతుంది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస అవసరాలకు సైతం తీవ్ర ఆటంకం ఎదురవుతుందని మదన పడుతున్నారు.

అనారోగ్యం బారిన..

ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దంపతులు 24 గంటలు పని చేసి సంపాదిస్తున్నా కుటుంబ సభ్యులు నచ్చిన వంటకాలతో మూడు పూటలు భోజనం చేయడం కష్టమవుతోంది. అలాంటిది నెలకు రూ.9 వేల వేతనంతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని పంచాయతీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాల సమస్యను పక్కన పెడితే తమకు పంచాయతీ అధికారులు సరిపడా మాస్కులు, గ్లౌజులు కూడా ఇవ్వకపోవడంతో చేతులతోనే చెత్త, చెదారాన్ని ఎత్తుతూ తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నట్లు పలువురు పారిశుద్ధ్య కార్మికులు వాపోతున్నారు. తమకు వేతనాలు పెంచాలని పంచాయతీ కార్మికులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొస్తున్నా వారు సానుకూలంగా స్పందించడం లేదు. ఏదో మొక్కుబడిగా వేతనాల పెంపు కోసం తమవంతుగా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని చెబుతున్నారని మండిపడుతున్నారు.



సిద్ధాపూర్‌లో చెత్తను తొలగిస్తున్న కార్మికులు

> **రూ.18 వేలు ఇవ్వాలి**
>
> 
>
> పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతో పాటు సీనియారిటీ ప్రకారం కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి. ఏడాదికి రెండు జతల దుస్తులు, విధుల్లో ఉన్నప్పుడు గ్లౌజులు, మాస్కులు అందివ్వాలి. ప్రస్తుతం ఇచ్చే వేతనాలతో ఇబ్బందులు పడుతున్నాయి.
>
> – సాయిబాబా, సీఐటీయూ, జిల్లా నాయకుడు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్: కమ్మదనంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అర్హులైన వారిని గుర్తించేందుకు ప్రభుత్వం సర్వే నిర్వహిస్తుందన్నారు. ఈ సర్వే రాజకీయ పార్టీలకు అతీతంగా కొనసాగుతుందన్నారు. పేదలు ఇళ్ల కోసం పైరవీలు చేసేందుకు అధికారులు, నాయకుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అధికారులే నేరుగా గ్రామాలకు వచ్చి సర్వే నిర్వహించి లబ్ధిదారులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బన్సీలాల్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, విశ్వం, తిరుపతిరెడ్డి, సర్వర్ పాషా, అప్పి, నవీన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

పట్టణంలోని ఈడెన్ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ క్రిస్మస్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కేకు కట్ చేసి అందరికి పంచారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, నాయకులు కృష్ణారెడ్డి, బాబర్‌ఖాన్, తిరుపతి రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బండకుంట తండాలో..

నందిగామ: మండల కేంద్రమైన నందిగామ అనుబంధ గ్రామమైన బండకుంట తండాలో సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహాయాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు చంద్రపాల్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, ఎంపీఓ తేజ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు శ్రీను నాయక్, బద్రునాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో సాంకేతికత అవసరం



రైతులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

చేవెళ్ల: వ్యవసాయరంగ అభివృద్ధికి ప్రభుత్వాలు చేపట్టే సాంకేతిక పరిజ్ఞానం, సంక్షేమ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయని వెల్ కృషి, వెల్స్పన్ ఫౌండేషన్ ప్రతినిధులు పవన్‌కుమార్, ఓమ్‌నాథ్ అన్నారు. మండలంలోని దేవరంపల్లి గ్రామంలో రైతు దినోత్సవంలో భాగంగా సోమవారం వెల్స్పన్, వెల్ కృషి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో రైతుల శ్రమ సమాజ ఆర్థిక వ్యవస్థకు దోహదం చేస్తోందన్నారు. సాగులో ఎదురయ్యే సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కుంటలో వైద్య శిబిరం

షాబాద్: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్స్పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ సురేఖ, మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామంలో వెల్స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏబీవీ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు 120 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు పవన్‌కుమార్, శిరీష, రమేష్, గ్రామస్తులు తదితరులున్నారు.

ఆలూరును మండలముగా మార్చండి



ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఆలూరు గ్రామస్తులు

ఎమ్మెల్యే యాదయ్యకు గ్రామస్తుల వినతి

చేవెళ్ల: తమ గ్రామాన్ని మండలంగా మార్చాలని ఆలూరు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు సోమవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మండలంలోనే అతిపెద్ద గ్రామ పంచాయతీగా ఉన్న ఆలూరును మండలంగా మార్చాలన్నారు. చేవెళ్ల మండల కేంద్రానికి తమ గ్రామం దాదాపు 15 కిలోమీటర్ల దూరంలో ఉందని, దీంతో పనుల నిమిత్తం వెళ్లాలంటే ఇబ్బందిగా మారిందన్నారు. జనాభా సైతం ఎక్కువగా ఉందని తెలిపారు. పరిపాలన సౌలభ్యం దృష్ట్యా మండలానికి అన్ని అర్హతలు ఉన్న ఆలూరును ప్రకటించాలని పేర్కొన్నారు. మండలంలోని తంగడపల్లి, తలారం, దుద్దాగు, కౌకుంట్ల, అంతారం, నౌలాయపల్లి, హస్తేపూర్, కిష్టాపూర్ నాంచేరి, ఖానాపూర్, రేగడిఘనాపూర్, చనువెళ్లి, ఇక్కారెడ్డిగూడ, బస్తేపూ, మీర్జాగూడ, న్యాలట, సింగప్పగూడ తదితర గ్రామాలను కలిసి మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే కాలె యాదయ్య స్పందిస్తూ.. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని వివరించారు.

భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలి

షాద్‌నగర్‌రూరల్: ప్రతిఒక్కరూ మార్గశిర మాసంలో భక్తి మార్గాన్ని అలవర్చుకొని భక్తిప్రపత్తులతో ఉండాలని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి షాద్‌నగర్ కమిటీ అధ్యక్షురాలు సద్గుణ అన్నారు. మార్గశిర మాసం(ధనుర్మాసం)ను పురస్కరించుకొని సోమవారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలపై ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ గ్రామంలో ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక కమిటీ సభ్యులు సంధ్య, శిరీష, వాసంతి, నవ్య, ధన్వంతరి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



పూజలో పాల్గొన్న శ్రీవర్ధన్‌రెడ్డి, నాయకులు

షాద్‌నగర్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్తి భావాన్ని పెంపొందించుకుంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అందెబాబయ్య, మదన్‌మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేష్‌గుప్తా, వెంకటేష్, వంశీకృష్ణ, హరిభూషణ్, ప్రవీణ్, శంకర్‌నాయక్, రమేష్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్



జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీనునాయక్

షాద్‌నగర్: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చింతగూడలో సీపీఎం పార్టీ గ్రామ శాఖ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తుందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలతో కేంద్రం చెలగాటం ఆడుతుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అనుగుణంగా కార్మికులకు కనీస వేతన చట్టాన్ని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ కార్యదర్శులుగా శంకరయ్య, ఆవుల వెంకటేష్, సభ్యులుగా సత్యం, శివకుమార్, యాదయ్య, మల్లారెడ్డి, శంకరమ్మ, తరుణ్ కుమార్, ప్రవీణ్‌కుమార్, శివకుమార్, అర్జునమ్మ, పద్మమ్మ, సరస్వతీ, యాదమ్మ, అంజి, శివమణి, శ్రీనివాస్, జగన్, లింగమ్మ తదితరులను ఎన్నుకున్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి



షాద్‌నగర్‌రూరల్: గణిత నమూనాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల చేసిన గణిత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గణితంలో క్విజ్, ఆటలు, పాటలు, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విద్యార్థులు శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకొని మేధావులుగా ఎదగాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కృష్ణమ్మ, ఉపాధ్యాయులు అరుణ, రేణుక, అటెండర్ మోహన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గణితంలో పట్టు సాధించాలి

షాబాద్: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకొని గణిత మేధావులు కావాలని షాబాద్ ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాలలో గణిత పితామహుడు శ్రీనివాస్ రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజిలమ్మ, కవిత, విద్యార్థులు తదితరులున్నారు.

విద్యార్థులకు దుస్తుల అందజేత

శంకర్‌పల్లి: విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలని శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లిలో గల ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం కొండకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థినిలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి, న్యాప్కిన్ ప్యాడ్స్ అందించారు. అనంతరం ప్రొద్దటూర్‌లోని వాల్మీకి గురుకుల అనాథ ఆశ్రమ విద్యార్థులతో కాసేపు గడిపి, చిన్నారులకు విటమిన్ మాత్రలు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొండకల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయుడు రఘునందన్‌రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దటూర్ వాల్మీకి గురుకుల అనాథశ్రమంలో మాత్రలు, దుస్తులు అందజేత

నూతన పింఛన్లు మంజూరు చేయాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కేశంపేట: ఐదేళ్లుగా అర్హులైన వారికి రాష్ట్ర ప్రభుత్వం నూతన చేయూత పింఛన్లను మంజూరు చేయడం లేదని మాజీ వైస్ ఎంపీపీ పసుల నరసింహయాదవ్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్లు మంజూరు కాని మహిళలతో కలిసి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం వెంటనే పింఛన్లను మంజూరు చేయాలని నరసింహయాదవ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేష్, నరేందర్‌రెడ్డి, భక్తవత్సలు, కుమార్, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

చేవెళ్ల: బోనాల ఊరేగింపు కనులపండువగా సాగింది. మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో సోమవారం పోచమ్మ, ఈదమ్మ గ్రామ దేవతల బోనాల ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



నాగిరెడ్డిగూడను మున్సిపాలిటీలో చేర్చాలి

మొయినాబాద్: నాగిరెడ్డిగూడ గ్రామ పంచాయతీ కొత్తగా ఏర్పాటు చేసే మొయినాబాద్ మున్సిపాలిటీలో చేర్చాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చంద్రలింగంగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి అతిచేరువలో హిమాయత్‌సాగర్ జలాశయానికి ఆనుకుని ఉన్న నాగిరెడ్డిగూడ గ్రామాన్ని మున్సిపాలిటీలో చేర్చకుండా విస్మరించడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేసి నాగిరెడ్డిగూడ గ్రామాన్ని మున్సిపాలిటీలో చేర్చాలన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి



డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న తోలుకట్ట గ్రామస్తులు

మొయినాబాద్: విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాదారుల చెర నుంచి కాపాడాలని రెవెన్యూ అధికారులకు తోలుకట్ట గ్రామస్తులు విన్నవించారు. మండల పరిధిలోని తోలుకట్ట గ్రామస్తులు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కు ఫిర్యాదు చేశారు. తోలుకట్ట రెవెన్యూలోని సర్వే నంబర్ 108, 143లో 11 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని.. నకిలీ పత్రాలు సృష్టించి కొందరు ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిలో బోరు వేశారని.. చుట్టూ ప్రీకాస్ట్ వాల్ నిర్మిస్తున్నారని తెలియజేశారు. కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో శివశంకర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, రమేష్, సురేందర్‌రెడ్డి, రాజుగౌడ్, యాదయ్య, నవీన్ తదితరులు ఉన్నారు.

జీవశాస్త్రంలో ప్రతిభా పరీక్ష



బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

షాబాద్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలని షాబాద్ ఎంపీడీఓ అపర్ణ, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో విద్యార్థులకు మండల స్థాయి జీవశాస్త్ర ప్రతిభా పరీక్ష-2024 కార్యక్రమం నిర్వహించారు. ఇంగ్లిషు మీడియంలో మొదటి బహుమతి అర్చన, తెలుగు మీడియంలో మొదటి బహుమతి కె.మహేశ్వరి ఎంపికయ్యారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



నియామక పత్రాలు అందజేస్తున్న మహేందర్

షాబాద్: బీజేపీ కార్యకర్తలు గ్రామాల్లో సైనికుల్లా పని చేయాలని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామంలో బూత్ 190, 191 కమిటీ అధ్యక్షులుగా ఎ.మల్లేష్, గుల్ల ఆంజనేయులులను ఎన్నుకొని నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరుగ్యారంటీల పేరుతో ప్రజలను మోసగించిందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులున్నారు.